ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.6 । కనిష్ఠం 23.4

కామారెడ్డి జిల్లా వార్తలు


5

ఆదివారం 28 జూలై 2024



ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ల అందజేత

రామారెడ్డి, జూలై 27: మండలంలోని అన్నారం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శనివారం రూ.50వేల విలువ గల కంప్యూటర్లను అంది జేసినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన కోడిప్యాక శివప్రసాద్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పని చేస్తున్నారు. ఆయన పాఠశాల అవసరాన్ని గుర్తించి కంప్యూటర్లను బహూకరించారని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ పోరుపై.. నజర్

- ఎన్నికలకు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశాలు
- ఇది వరకే వివరాలు సేకరించిన ప్రభుత్వం
- ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభం
- ఐదు నెలల్లో పంచాయతీ పోరు నిర్వహించే అవకాశం
- రిజర్వేషన్లపైనే అంతటా చర్చ
- ప్రయత్నాలు మొదలు పెడుతున్న ఆశావహులు
- జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు, 4,642 వార్డులు



కామారెడ్డి, జూలై 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఎన్నికలకు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జనవరిలోనే సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఆ సమయంలోనే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం జిల్లా అధికారుల నుంచి వివరాలు సేకరించారు. అయితే రిజర్వేషన్లపై సందిగ్ధత నెలకొంటూ వస్తోంది. బీసీ రిజర్వేషన్‌లు ప్రకటించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. రిజర్వేషన్లకు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఐదు నెలల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో రిజర్వేషన్లపైనే అంతటా చర్చ కొనసాగుతోంది. బీసీలకు ఎంతమేర రిజర్వేషన్‌లు కల్పిస్తారో అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. పంచాయతీ ఎన్నికలు జరిగిన వెంటనే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం దృష్టి సారించినందున పోటీ చేసేందుకు ఆశావహులు ప్రయత్నాలు మొదలు పెడుతున్నారు.

జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో మొత్తం 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,642 వార్డులు ఉన్నాయి. వీరందరి పదవి కాలం ఇప్పటికే ముగిసింది. 2019 ఓటరు జాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 5,18,201 ఓట్లు ఉన్నాయి. ఇందులో పురుషులవి 2,50,447, మహిళలవి 2,82,613, థర్డ్ జండర్‌వి 4 ఓట్లు ఉన్నాయి. అయితే జిల్లాలో 526 గ్రామ పంచాయతీలే కాకుండా మరో 9 గ్రామ పంచాయతీల ఏర్పాటుకు గతంలోనే ప్రభుత్వానికి జిల్లా అధికారులు నివేదించారు. ఈ కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కామారెడ్డి జిల్లా ఆవిర్భావంతో పాటు 22 మండలాలను ఏర్పాటు చేశారు. 22 మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. అయితే గత 3 కొత్త మండలాలైన డోంగ్లి, పల్వంచ, మహ్మద్‌నగర్‌లను ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే పాత జీపీలు, మండలాలతో పాటు కొత్తగా ఏర్పడి వాటిలోను నిర్వహించనున్నారు.

సిద్ధంగా ఉండాలని ఆదేశాలు

పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అందు కోసం యంత్రాంగం సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో పాటు జిల్లా అధికారులు గ్రామ పంచాయతీకి సంబంధించి రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు ఉన్నాయనేది తెలియజేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలోనే నిర్వహించనున్నారు. సర్పంచ్‌లను నేరుగా ఎన్నుకోనుండగా ఉప సర్పంచ్‌లను పరోక్ష పద్ధతిన ఎన్నుకుంటారు. వార్డు సభ్యులు, సర్పంచ్ ఎన్నికల కోసం ప్రతీ వార్డుకు ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తారు. సర్పంచ్, వార్డు సభ్యునికి వేర్వేరుగా తెలుపు, గులాబీ రంగు బ్యాలెట్ పేపర్లను ముద్రణకు చర్యలు చేపడతారు. ఈ ఎన్నికలకు పార్టీ గుర్తులు ఉండవు. ముందుగానే ముగ్గురు, నలుగురు పేర్లతో కూడిన నమూనా బ్యాలెట్ పేపర్లను రూపొందిస్తున్నట్లుగా తెలిసింది. 200 మంది చొప్పున పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణ యించినట్లుగా సమాచారం. ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక సహాయ అధికారి ఉండనున్నారు.

రిజర్వేషన్లపైనే చర్చ

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్లు ప్రధాన అడ్డంకిగా మారాయి. గత ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన పంచాయతీరాజ్ చట్టం ఎన్నికల స్థానాలకు రిజర్వేషన్లు పదేళ్ల పాటు వర్తిస్తాయని పేర్కొంది. తాజాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలా లేక రిజర్వేషన్లలో మార్పులు చేస్తుందా అనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జనాభా ప్రాతిప దికన రిజర్వేషన్లు కేటాయించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీసీ గణన అంశం తెర మీదకు వచ్చినందున స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌లు ఎలా ఉండబోతున్నాయనే దానిపై నే అంతటా చర్చ సాగుతోంది.

పోటీకి సిద్ధం అవుతున్న ఆశావహులు

ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గ్రామ, మండల స్థాయిలో పని చేసి పార్టీల గెలుపునకు కృషి చేసిన నాయకులంతా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొన్నిచోట్ల అప్పుడే తాము పోటీ చేస్తామని బహిరంగగానే చెబుతున్నారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఆశావహులు పెద్ద సంఖ్యలో ఉండనున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్‌కు పని చేసిన వారు ఎన్నికల ముందు, తర్వాత పార్టీలోకి వచ్చిన నేతలు కూడా పెద్ద ఎత్తున ఉన్నారు. దీంతో అభ్యర్థుల ఎంపిక ఆ పార్టీకి తలనొప్పిగా మారే అవకాశం ఉంది. ఇప్పటి నుంచే ఆశావహులు తమ పార్టీ ముఖ్యులను కలుస్తూ ఎన్నికల్లో ఏ విధంగా కష్టపడాలో తెలియజేస్తూ మద్దతును పొందే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

తగాదాల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి సుజయ్‌పాల్

కామారెడ్డి టౌన్, జూలై 27: స్వచ్ఛందంగా, సామాజిక బాధ్యతతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ సూచించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో కమ్యూనిటీ మీడియేషన్ వాలింటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2023లో తీసుకొచ్చిన మీడియేషన్ యాక్ట్ ద్వారా సామాజిక స్పృహ సేవాభావం కలిగిన కొందిరిని కమ్యూనిటీ మెడిటేషన్ వాలింటర్లుగా ఎంపిక చేశామన్నారు. చిన్నచిన్న తగాదాలతో పోలీసు స్టేషన్‌లు, కోర్టుల వరకు వెళ్లి సమయం, ధనం వృథా చేసుకుంటున్నారన్నారు. ఇరువర్గాలను సముదాయించి సమస్యను పరిష్కరిస్తే న్యాయంతో పాటు స్నేహపూర్వకంగా సమాజం నిర్మితమవుతుందని అన్నారు. కేరళ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇలాంటి మీడియేషన్ సెంటర్‌ల ద్వారా ఐదు వేలకు పైగా కేసులు పరిష్కారమయ్యాయన్నారు. హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తెలంగాణలో ఒక సామాజిక కార్యకర్త, పెద్దమనుషుల సమక్షంలో తగదాలను పరిష్కరించడానికి కమ్యూనిటీ మేడియేషన్ వాలంటీర్లు పని చేయాలన్నారు. చిన్న సమస్యల వల్ల ఏళ్ల తరబడి క్యూ పెంచుకుంటున్నారని కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరుల జీవితం కోర్టుల చుట్టు తిరిగి సమయాన్ని, డబ్బులను వృథా చేసుకుంటున్నారని తెలిపారు. ఎలాంటి క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ లేని కమ్యూనిటీ వాలంటీర్లకు గొప్ప బాధ్యతను సక్రమంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా సామాజిక బాధ్యతతో కుటుంబ, వ్యక్తిగత, భూ వైవాహిక తగదాలను పరిష్కరించాలని సూచించారు. ఏళ్ల క్రితం గ్రామాల్లో పెద్దమనుషులే ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను అక్కడిక్కడే పరిష్కరించేవారు. ఇప్పటి నుంచి సమస్యలను పరిష్కరించే కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లతో రాష్ట్రంలో ఆదర్శవంతంగా పని చేయాలని తెలిపారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా సమస్యలను పరిష్కరించడం వల్ల సమాజంలో మంచి వాతావరణం ఏర్పడుతుందని ఇందుకోసం వాలంటీర్లు కృషి చేయాలని అన్నారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ సమాజంలో మంచి పేరు, రాజకీయ ప్రమేయం లేని ఇలాంటి క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ లేనివారిని గుర్తించి కమ్యునిటీ వాలంటీరుగా ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రెటరీ పంచాక్షరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్, న్యాయమూర్తులు శ్రీనివాస్ నాయక్, నాగరాణి, సుధాకర్, దీక్ష, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వర ఆలయ సందర్శన

భిక్కనూరు: దక్షిణకాశీగా కొలిచే భిక్కనూరు సిద్ధరామేశ్వర స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న అతి ప్రాచీన కోనేరును శనివారం హైకోర్టు న్యాయమూర్తి సుజయ్ పాల్ కామారెడ్డి జిల్లా పోర్టు పోలియో న్యాయాధికారి జె. శ్రీనివాస్‌రావుతో కలిసి శనివారం పరిశీలించారు. ప్రాచీన శిల్పకళా సంపదకు నిదర్శనంగా ఈ కోనేరు నిలుస్తుందని కొనియాడారు. ఆలయ అర్చకులు కోనేరు విశిష్టతను, దేవాలయ చరిత్రను వారికి వివరించారు. వారి వెంట తహసీల్దార్ శివ ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




పాఠశాల పై అంతస్తులో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు

పెద్దమల్లారెడ్డి పాఠశాలలో..
సమస్యల తాండవం!

- ఉన్న ఒక్క మూత్రశాలకు మధ్యలో రేకులు అడ్డం పెట్టి బాలబాలికలు ఉపయోగించుకుంటున్న వైనం
- పాఠశాల ఆవరణలో కోతులు, పందులు, కుక్కల స్వైర విహారం
- అసంపూర్తిగా తరగతి గదులు, మూత్రశాలలు

భిక్కనూరు, జూలై 27: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా చాలా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి క్షేత్రస్థాయిలో దయనీయంగా ఉంటున్నాయి. చిన్నపాటి వర్షానికే పాఠశాల ఆవరణలో నీరు నిలవడం, కోతులు, పందులు, కుక్కలు స్వైర విహారం చేయడం, సిబ్బంది కొరత, మూత్రశాలలు సరిగ్గా లేకపోవడంతో పాటుగా అనేక సమస్యలతో విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సైతం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉంది. భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి ఉన్నత పాఠశాల సైతం ఇదే కోవలోకి వస్తోంది. ఈ పాఠశాలలో చిన్నపాటి వర్షానికే పాఠశాల ఆవరణ చిత్తడిగా మారుతోంది. నిత్యం పందులు, కుక్కలు పాఠశాల ఆవర ణలోనే తిష్ఠ వేస్తున్నాయి. కోతులైతే విద్యార్థులను, ఉపాధ్యాయులను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. కోతుల నుంచి రక్షించుకుకోవడానికి తరగతి గదుల తలుపులు మూసుకొని ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలను బోధించాల్సి పరిస్థితి నెలకొంది. మన ఊరు మన బడి కార్యక్రమంలో నిర్మించిన తరగతి గదులు, మూత్రశాలలు సైతం అసంపూర్తిగా ఉన్నాయి. వర్షాకాలం కావడంతో పాఠశాల ఆవరణలో పిచ్చిచెట్లు, గడ్డి ఏపుగా పెరిగి వనంలా తయారైంది.



పాఠశాల ఆవరణలో పందుల సంచారం

మూత్రశాలలో రేకులను అడ్డం పెట్టిన దృశ్యం

కిటికీలకు జాలీ ఏర్పాటు చేసిన దృశ్యం

ఉన్న ఒక్క మూత్రశాలకు మధ్యలో రేకులు అడ్డం పెట్టి ఉపయోగించుకుంటున్న బాల బాలికలు

మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల పైఅంతస్తులో తరగతి గదుల నిర్మాణానికి, మూత్రశాలల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా పూర్తి స్థాయిలో పనులు కాగా ప్రస్తుతం అవి అసంపూర్తిగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం పాఠశాలలో ఉన్న ఒక్క మూత్రశాలకు మధ్యలో రేకు అడ్డం పెట్టుకొని అబ్బాయిలు, అమ్మాయిలు సగ భాగం, సగ భాగం ఉపయోగించుకుంటున్నారు. మూత్రశాలలు సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను, మూత్రశాలలను అధికారులు స్పందించి పూర్తి చేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

పాఠశాల ఆవరణలో కోతులు, పందులు, కుక్కల స్వైరవిహారం

పాఠశాల ప్రహరీ అక్కడక్కడ కూలిపోవడంతో పందులు, కుక్కలు ఇక్కడే తిష్ఠ వేస్తున్నాయి. వాటిని ఎన్నిసార్లు బయటకు వెళ్లగొట్టినా మరల ఇక్కడికే చేరుకుంటున్నాయని, ఒక్కో సమయంలో పందులు, కుక్కలు కరవడానికి వస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. ఉదయం పాఠశాలకు వచ్చే సరికి పెద్దఎత్తున కోతుల మంద ఉంటుందని, తరగతి గదులతో పాటుగా వరండాను అధ్వానంగా చేస్తున్నాయని, కోతుల నుంచి కాపాడుకోవడానికి సిబ్బంది ప్రతీ కిటికికీ జాలీ ఏర్పాటు చేయించినా తలుపుల నుంచి లోనికి వస్తున్నాయని, వరండాలోనే ఎక్కువగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటెండర్, స్వీపర్, స్కావెంజర్ లేక ఇబ్బందులు

పాఠశాలలో అటెండర్, స్వీపర్, స్కావెంజర్ లేక ప్రతిరోజూ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఉపాధ్యాయులు కలిసి ఒక వ్యక్తిని స్వీపర్‌గా నియమించుకున్నప్పటికీ పెద్ద పాఠశాల కావడంతో ఒకరితో కావడం లేదు, పైగా పాఠశాల వరండాలో కోతులు మలమూత్ర విసర్జన చేస్తుండటంతో ప్రతిరోజూ కింద వరండాతో పాటుగా పైఅంతస్తు వరండాని కూడా నీటితో కడగాల్సి వస్తోంది. అటెండర్ లేకపోవడంతో ప్రతీ చిన్న పనిని ఉపాధ్యాయులే చేసుకోవాల్సి పరిస్థితి ఉంది.

కోతుల బెడద తట్టుకోలేకపోతున్నాం

● ప్రసూనాదేవి, పాఠశాల హెచ్‌ఎం


పాఠశాలలో ప్రతిరోజూ కోతుల బెడదను తట్టుకోలేకపోతున్నాం. కోతులు తగరతి గదుల్లో, వరండాలోనే రాత్రి సమయంలో ఉంటూ అధ్వానంగా మారుస్తున్నాయి. ఇటీవల నా సొంత ఖర్చులతో పాఠశాలలోని ప్రతీ కిటికీకి జాలీ ఏర్పాటు చేయించా. తమ పాఠశాలలో అటెండర్, స్వీపర్, స్కావెంజర్ లేకపోవడంతో తామే గ్రామానికి చెందిన ఒకరిని నియమించుకున్నాం. పందులు, కుక్కలు పాఠశాల ఆవరణలోనే ఉంటున్నాయి. వాటిని ఎంత వెళ్లగొట్టినా ఫలితం ఉండటం లేదు. అధికారులు తమ పాఠశాలకు అటెండర్, స్వీపర్‌ను కేటాయిస్తే రుణపడి ఉంటాం.

10 అడుగులకు చేరిన పోచారం నీటిమట్టం

నాగిరెడ్డిపేట, జూలై 27 : పోచారం ప్రాజెక్టు నీటి మట్టం 10 అడుగులకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నీటి మట్టం రోజు రోజుకూ పెరుగుతోంది. పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతోంది. శనివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 10 అడుగుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.820 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.489 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులోకి శుక్రవారం 676 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. రోజురోజుకూ ప్రాజెక్టు నీటి మట్టం పెరుగుతుండటంతో ఆయకట్టు రైతు లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పోచారం ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం



'ప్రతిభకు పదును పెడితే విజయం దరి చేరుతుంది'

కోటగిరి, జూలై 27 : ప్రతి విద్యార్థి ప్రతిభకు పదును పెడితే విజయం దరి చేరుతుందని కల్ప తరువు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ భాను శీరిషా పేర్కొన్నారు. కోటగిరి మండలం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు కల్ప తరువు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ చిన్నారులకు స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు ఒకరికి సహాయం చేయాలని తమ ఫౌండేషన్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

'విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి'

డిచ్‌పల్లి, జూలై 27 : తెలంగాణ విశ్వవిద్యాలయంలోని అర్థశాస్త్ర విభాగం పీజీ చివరి సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విభాగాధితి డా.ఏ పున్నయ్య మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం గొప్ప అనుభవాన్ని ఇస్తుందని,ఈ అనుభవంతో సమాజంలో బాధ్యత గల పౌరులుగా ఉండాలన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలంరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, రవీం దర్‌రెడ్డి, టి.సంపత్, స్వప్న, శ్రీనివాస్, దత్తహరి పాల్గొన్నారు

పోస్టర్ల ఆవిష్కరణ

నవీపేట, జూలై 27 : మండలంలోని అభంగపట్నంలో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 28న ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్రకమిటీ సభ్యులు రాయల చంద్రశేఖర్ సంతాప సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

జక్రాన్‌పల్లి, జూలై 27 : మండలంలోని గన్యాతండా గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మూగవ్యక్తి చౌహన్ అకాష్ అదృశ్యమైనట్లు సీహెచ్. తిరుపతి తెలిపారు. శనివారం ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం గన్యాతాండా గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మూగవ్యక్తి చౌహన్‌అకాష్ ఇంటి నుంచి ఈనెల 25న మధ్యాహ్నా 3గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్ళి తిరిగిరాలేదన్నారు. అతని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలించినా ఆర్మూర్ వైపు నడుకుంటూ వెళ్ళాడని తెలిసి చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినప్పటికీ ఏలాంటి ఆచూకీ తెలియరాలేదని అతని తండ్రి చౌహన్ కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు


విద్యార్థులకు పోటీలు

డిచ్‌పల్లి, జూలై 27 : తెలంగాణ విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో విద్యార్థులకు భారతదేశఅభివృద్ధిలో యువత పాత్ర అనే అంశం పై వక్తృత్వ పోటీలు శనివారం నిర్వహించారు. పోటీలకు విద్యార్థులు సందీప్, సుమిత్, సంగు, మధులు ఈవెంట్ మేనేజర్‌లుగా వ్యవహరించారు. పోటీల్లో మొదటి బహుమతి బాంధవ్య, ద్వితియ బహుమతి సంతోశ్, తృతీయ బహుమతి గజేందర్‌లు అందుకున్నారు.



















ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉంది

● మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు

డిచ్‌పల్లి,జూలై 27: ప్రభుత్వం ఏర్పాటు సమయంలో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నిలుపుకుటుందని 2లక్షల రుణమాఫీ కి ప్రభుత్వం కట్టుబడి ఉందని శనివారం సాయంత్రం మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అన్నారు. మండంలోని ధర్మారం(బి) గ్రామంలోని ఆయన ఇంటిలో విలేకర్లతో మాట్లాడారు. తాను రైతుగా ప్రజాప్రతినిధిగా రైతాంగంలో ఉన్న రైతు రుణ మాఫీ అనుమానాలను నివృత్తి చేసుకునే విధంగా ఈ విలేకర్ల సమావేశం నిర్వహిస్తున్నమని రుణమాఫీ విషయంలో రైతులు మొదట దఫ రూ.1లక్ష, రెండో దఫా 1.5లక్షలు, మూడో దపా 2లక్షల రుణ మాఫీ ప్రభుత్వం చేస్తుందని రుణ మాఫీ జరగని రై తులు ఆందోళన చెంద వద్దని రైతులకు ఏవైన అనుమానాలు ఉంటే వ్యవసాయాధికారుల వద్ద మాఫీ జాబితా ఉందని టెక్నికల్ సమస్యలతో కొన్ని చోట్ల ఆధార్ నంబర్, పేర్లు సక్రమంగా లేక పోవడంతో మాఫీ రాలే దని అలాంటి తప్పిదాలకు రైతులు నివృత్తి చేసుకోవాలన్నారు. రైతులు తప్పకుండా వ్యవసాయాధి కారులకు వద్ద వెళ్లి సరిచూసుకోవాలని ఆయన కోరారు. రుణమాఫీ జర గాని విషయం తన దృష్టి కి తీసుకురావడం వల్లే అధికారుల వద్ద నివేది కలు తెప్పించుకొని రైతులకు ఈ సూచనలు చేస్తున్నానని తెలిపారు. ధరణిలో పేర్లు తప్పులుగా ఉన్న రేషన్ కార్డులు లేని వారికి కూడా తహసీల్దార్, కలెక్టర్‌లు తాత్కలికంగా లోన్ అర్హత కోసం వారి వివరాలు ఇస్తారని మండవ స్పష్టం చేశారు. అప్పుల ఊబిలో చిక్కుకున్న రైతాంగం అస లు వడ్డీతో బయటపడలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇచ్చిన మాటాకు కట్టుబడి రుణ మాఫీ చేసిందన్నారు. ఈవిలేకర్ల సమావేశంలో సీనియర్ నాయకులు బాగిర్తిబాగారెడ్డి,కిషన్‌రెడ్డి ఉన్నారు.

కొత్త ఆవిష్కరణలకు ఇంటింటా ఇన్నోవేటర్



ఏర్గట్లలో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు

ఏర్గట్ల, జూలై 27: ప్రతీ ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని వెలికి తీసి వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌లను అవిష్క రించారు. తమ ఆలోచనలు,సృజనాత్మకతను జోడించి ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలని, దీనికి సంబంధించిన అవగాహన జిల్లా కోఆర్డినేటర్ సందీప్ రాజ్ వివరించారు. ఈకార్యక్రమంలో డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీవో శివచరణ్, ఏపీఎమ్ శ్యామ్, ఐకేపీ సీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై అసంతృప్తి



లంగ్డాపూర్‌ని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి

బోధన్‌రూరల్,జూలై27: బోధన్ మండలంలోని బర్దీపూర్, లంగ్డాపూర్, తదితర గ్రామాలలో జిల్లా పంచాయతీ అధికారి, బోధన్ మండల ప్రత్యేక అధికారి నీహెచ్, తరుణ్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులను, ప్రభుత్వ పాఠశాలల్లో పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య పనులు ఈ విధంగా ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు చేయకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్‌ను ప్రభుత్వ నిబంధనలతో పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో మధుకర్, ఏపీవో హేమలత, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

డిగ్రీ వన్‌టైం పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి,జూలై 27: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లగ్ వన్‌టైం పరీక్షలు శని వారం 25వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 22విద్యార్థులకుగాను 20మంది హాజర య్యారని,ఇద్దరువిద్యార్థులు గైర్హాజరని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఆయన తెలిపారు.

బోధన్ మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

బోధన్‌రూరల్,జూలై27: బోధన్ మున్సిపాలిటీలో అత్యవసర కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధన్ పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.పట్టణంలోని తదితర వార్డులకు ప్రత్యేక ఇన్‌చార్జులను నియమించామన్నారు. పాత బోధన్‌లో మట్టి ఇళ్లలో నివాసం ఉండే వారు ఇల్లులు ఖాళీ చేసి ఇతర చోట్ల ఉండాలన్నారు. ప్రజలకు అవసరమైతే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలను విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు.

విద్యార్థి అదృశ్యం

బోధన్‌రూరల్,జూలై27: బోధన్ పట్టణంలోని ఓప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థి అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు శనివారం ఫిర్యాదులో పేర్కొన్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళ్లి తిరిగి వచ్చి సాయంత్రం సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు పాఠశాల నిర్వాహకులు తెలుపగా కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. సీసీపుటేజీలో అన్నికోణాల్లో పరిశీలించి తప్పిపోయినబాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తామన్నారు.

కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ పరీక్షలు

డిచ్‌పల్లి,జూలై 27: విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటిగ్రేటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ 6,8,10వ సెమిస్టర్ , ఎల్‌ఎల్‌బీ 6, ఎంబీఏ, ఎంసీఏ 1,3వ సెమిస్టర్, ఐఎంబీఏ 7,9 వసెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లగ్ పరీక్షలు శుక్రవారం 11వ రోజు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఆర్ట్స్ కళాశాల, న్యాయ కళాశాలలో జరిగిన పరీక్షల్లో 78మంది విద్యార్థులకు గాను 71మంది పరీక్షకు హాజర య్యారని 7గురు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

బోధన్‌రూరల్,జూలై27: బోధన్ మండలం పెద్దమావంది గ్రామానికి చెందిన సూర్య సురేష్(35)అనే వ్యక్తి శుక్రవారం ఉదయం మృతి చెందగా మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి అక్క పోశవ్వ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. శుక్రవారం ఉదయం మృతుడి భార్య కావ్య సూర్య సురేష్ మృతి చెందాడని ఏడవడంతో అంత్యక్రియల సమయంలో అనుమానాలు తలెత్తాయని మృతుడి అక్క పోశవ్వ ఫిర్యాదులో పేర్కొందన్నారు. పోశవ్వ ఫిర్యాదు మేరకు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

చిత్తడిగా మారిన వారసంత

● ఇబ్బందులు పడుతున్న అమ్మకందారులు, కొనుగోలుదారులు ● పట్టించుకోని సంబంధిత అధికారులు



చిత్తడిగా మారిన నవీపేట సంత



సంతలో ఇబ్బందులు పడుతున్న అమ్మకందారులు, కొనుగోలుదారులు

నవీపేట,జూలై27:నవీపేటగ్రామపంచాయతీ పరిధిలోని సంత స్థలం చిత్తడిగా మారింది. ఇదే సంతలో ప్రతీ శుక్రవారం వారంతపు సంత, శనివారం మేకల సంతను నిర్వహిస్తుంటారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు సంత పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో శుక్రవారం జరిగిన వారంతపు సంతలో అమ్మకందారులు, కొనుగోలుదారులు ఇబ్బ ందులు పడగా శనివారం సైతం మేకల సంతలో అమ్మకందారులు, కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారు. గ్రామ పంచాయతీకి వారంతపు సంత, మేకల సంతల ద్వారా ప్రతీ సంవత్సరం లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతున్నప్పటికీ సంతలో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంతలో నెలకొన్న బురదను తొలగించి మొరంతో చదును చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

● భారీగా మేకల క్రయ, విక్రయాలు

ఆదివారం జరిగే బోనాల పండుగను పురస్కరించుకుని నవీపేటలో శనివారం జరిగిన మేకల సంతలో జోరుగా క్రయ,విక్రయాలు జరిగాయి.పండుగను పురస్కరించుకుని వ్యాపారులు జీవాలను అధిక ధరలకు విక్రయించారని కొనుగోలుదారులు పేర్కొన్నారు. ధరలు ఎక్కువ అయినప్పటికీ భారీగా క్రయ, విక్రయాలు జరిగాయి. జిల్లాలోని పలు ప్రాం తాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి పెద్ద ఎత్తున కొనుగోలుదారులు నవీపేట సంతకు తరలివచ్చిజీవాలను కొనుగోలు అమ్మకాలు చేశారు. అధికారులు స్పందించాలన్నారు.

ఉపాధ్యాయులు లేక మూతబడిన ఉర్దూ పాఠశాలలు

● మూడేళ్లుగా ఉపాధ్యాయులేక మూత బడిన పాఠశాలలు ● విద్యకు దూరమైన విద్యార్థులు
● పాఠశాలను తెరిపించాలని తల్లిదండ్రుల విన్నపం ● పట్టించుకోని అధికారులు



సిరికొండ ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

సిరికొండ జూలై 27: అన్ని భాషల వారికి విద్య అందుబాటులోకి తీసుకరావలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఉర్దూ మీడియం పాఠశాలలు ఉపాధ్యాయులేక మూతబడి మూడేళ్ల కావస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్, సిరికొండ గ్రామాల్లో సుమారు పదిహేనేళ్ల క్రితం ఉర్దూ మీడియం పాఠశాలలను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సుమారు పది, పన్నేడేళ్ల పాఠశాలలు బాగా పనిచేశాయి. అప్పట్లో ఉపాధ్యాయులు ఉండడం వల్ల విద్యార్థులు సైతం పాఠశాలలకు వచ్చి విద్యాభ్యాసం చేశారు. మూడు నాలుగేళ్ల క్రితం ఉపాధ్యాయులు బదిలీ కావడంలో స్థానికంగా ఉండే మైనారిటీ సంఘాలు ఒక ఏడాది పాటు విద్యావలంటీర్లను పెట్టుకుని తమ పిల్లలకు విద్యాను అందించడానికి కృషి చేశారు.మళ్లీ నియమించుకోవడానికి డబ్బులేక పోవడం వల్ల పాఠశాలలు మూత బడ్డాయి. పాఠశాలలు మూతబడి మూడేళ్ల కావస్తున్న ప్రభుత్వం పట్టించుకోక పోవడం బాదకరమని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. పెద్దవాల్గోట్ స్కూల్లో 50 నుంచి 60 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం వారందరిని ప్రభుత్వం ప్రాథమికి పాఠశాలలో పంపిస్తున్నారు.సిరికొండ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల 2022లో 317 జీవో వల్ల ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లడంతో ఆ ఏడాది విద్యా వాలంటీర్‌ను ఏర్పాటు చేసుకుని తమ పిల్లలకు విద్యాబోధన చేయించినట్లు మైనారిటీ నాయకుడు ముషీర్ తెలిపారు. ఆర్థిక సహాయం చేసే వారు లేక పోవడంతో విద్యావాలంటీర్ ను తిరిగి నియమించుకోలేక పోయినట్లు తల్లిదండ్రులు తెలిపారు.దీని వల్ల పాఠశాల మూత బడిందన్నారు.సుమారు 45మంది పిల్లలు పాఠశాలకు వచ్చే వారని మైనారిటీ సంఘ నాయకుడు ఆసీఫ్ తెలిపారు.ఉపాధ్యాయులను నియమించాలని ఇటీవల సిరికొండకు వచ్చిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు ఆసీఫ్ కోరారు.

ఉపాధ్యాయులను నియమించి పాఠశాలలు తెరిపించాలి

మూతబడిని పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అన్ని భాషల వారికి వారి వారి మాతృ భాషలో విద్యా బోధన చేయించాలనే సదాశయంతో ఏర్పాటు చేసిన పాఠశాలలను తిరిగి తెలిరిపించాలని మైనారిటీ సంఘం మండల నాయకులు లియాకత్ ప్రభుత్వాన్ని కోరారు.

-లియాకత్, గ్రామస్థుడు

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

● సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అదనపు జేసీ అంకిత్



సిరికొండలో ప్రజా పాలన రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సిరికొండ జూలై 27: ప్రజా పాలనలో తీసుకున్న పథకాల అమలు కోసం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను రిజిష్టర్‌లో ఏ రోజుకారోజు ఎందుకు రాయడం లేదని అదనపు కలెక్టర్ అంకిత్ మండల పరిషత్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అదనపు (స్థానిక సంస్థల) కలెక్టర్ అంకిత్ శనివారం సిరికొండలో ఆకస్మిక పర్యటన చేశారు. మొదట మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రజాపాలనకు సంబందించిన రికార్డులను పరిశీలించారు. మండలంలో ప్రజాపాలనలో అమలు అవుతున్న పథకాలలో గృహజ్యోతి, వంటగ్యాస్ వంటి పథకాలు వర్తిండం లేదని దరఖాస్తులు చేసుకున్న వారు ఎంత మంది దరఖాస్తులు చేసుకున్నారని. అనిసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను ఏరోజుకారోజు రిజిష్టర్‌లో రాశారా? అనిఅడిగితే సిబ్బంది సరియైన సమాధానం చెప్పక పోవడంతో అదనపు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వచ్చిన దరఖాస్తులను ఖచ్చితంగా రిజిష్టర్‌లో నోట్ చేయాలని సిబ్బందికి సూచించారు. పల్లె ప్రకృతి వనాన్ని అదనపు జేసీ పరిశీలించి సూచనలు చేశారు. హైస్కూల్‌కు వెళ్లి టీచర్లు విద్యాబోధన ఎలా చేస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను విద్యావంతులుగా ఎదిగే విధంగా తీర్చిదిద్దాలని ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్‌కు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించారు. రుచికరంగా వంటలు చేయాలని ఆయన వంట చేసే ఏజెన్సీ సభ్యులకు సూచించారు.ఆయన వెంట ఇన్‌చార్జీఎంపీడీవో తారచంద్ నాయక్, పంచాయతీకార్యదర్శులు,ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో చంద్రశేఖర్, సాంకేతిక సహాయకులు ఉన్నారు.

బోధన్‌లో ఘనంగా ఊర పండుగ

బోధన్‌రూరల్,జూలై27: బోధన్‌లో ఇటీవల నిర్వహించిన ఊర పండుగలో భాగంగా శనివారం మర్గవ్వ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. పట్టణంలోని తట్టికోట ప్రాంతంలో ఉన్న మర్గవ్వ దేవాలయం నుండి పోతరాజుల విన్యాసాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా సకాలంలో కురువాలని, పాడిపంటలు చల్లగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

ఆర్మూర్‌రూరల్, జూలై27: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని మరింత బలోపేతం చేసి సత్తా చాటాలని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. శనివారం ఆలూర్ మండల కేంద్రంలో జరిగిన మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఈకార్యక్రమంలో ఆలూర్ మండల బీజేపీ అధ్యక్షుడు కొత్తూరు గిరిష్, ప్రధానకార్యదర్శి శ్రీకాంత్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారి యాదగిరి, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహేష్, లోక రాంరెడ్డి, నడిసెరం మల్లయ్య, ప్రళయ్‌తేజ, హరిష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌కు ఢీకున్న బైక్, ఒకరి మృతి

వేల్పూర్, జూలై27: వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొనగా అదే గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. సంతోష్ వెంకటాపూర్ గ్రామ శివారులో ఆర్డర్‌మెస్‌లో కోళ్ళను దించడానికి తన బైక్‌పై ఇంటి నుంచి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ మాలసంఘం వద్ద రోడ్డుపై ఎలాంటి పార్కింగ్ సిగ్నల్స్ పెట్టకుండా కొండల మహిపాల్ నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో సంతోష్ తలకు బలమైన గాయాలై రక్తస్రవం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని భార్య బాగ్యలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో కోసం పది వేలు అందజేత

ఏర్గట్ల, జూలై 27: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గత ఏడు నెలలుగా మధ్యాహ్న భోజనం అందించకపోవడంతో సోషల్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా డైరెక్టర్ కట్కం శామంత్, ఆర్మూర్ డివిజన్ ఛైర్మన్ నరేష్‌లు 10 వేలు పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ ఛైర్మన్ కొప్పుల విజయ్ కుమార్, జనరల్ సెక్రెటరీ మనోహర్ ఆదేశాల మేరకు విషయం తెలుసుకుని మధ్యాహ్న భోజనానికి విరాళం అందజేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనన ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆంధ్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో అబ్దుల్‌కలాం వర్ధంతి

మోర్తాడ్, జూలై27:మండల కేంద్రంలో శనివారం దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం వదో వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. అబ్దుల్‌కలాం చిత్రపటానికి దళి త సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లూరి ఎం.రాజారాం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత రాష్ట్రపతిగా సేవలందించారని, మిస్ట యిల్ మ్యాన్ ఆఫ్ ఇండియా భారతరత్న ప్రభుత్వం గౌరవించిందని అ న్నారు. విద్యార్థులు, యువకులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకో వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జంబవ చామర్ మామిడి రవి, రాజు, నరేందర్, అమర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: భారత మాజీ రాష్ట్రపతి శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి ని పురస్కరించుకుని సిరికొండలో ఉపాధ్యాయులు కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఓ పాఠశాలలో కలాం వర్ధంతి హెచ్ఎం మాట్లాడుతూ అణు వైజ్ఞానికి రంగంలో విప్లవాత్మక మార్పులతో భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఏపీజే అబ్దుల్ కలాం అపరమేధావని కొనియాడారు. శాస్త్రవేత్తగా,రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. మరో పాఠశాలలో కూడ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాల హెచ్ఎం కలాం దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యకక్రమాల్లో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

బోధన్‌రూరల్,జూలై27: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని వర్డ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మధుమలాంచ, కల్దుర్కి ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు కౌమర దశలో వచ్చే మార్పుల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, చట్టాలపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మధుమలాంచ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నరేందర్, కల్దుర్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాదును విజయవంతం చేయాలి

ఎడపల్లి, జూలై27: పంచాయతీ కార్మికుల సమస్య పరిష్కారం కోసం ఈ నెల 30 న చేపట్టిన ఛలో హైదరాబాదును విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలో ఛలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు జొగ్గరి పద్మ, మండల నాయకురాలు లక్ష్మి, మండల కోశాధికారి కుంట సంతోష్, శ్రీను, ప్రశాంత్, ప్రవీణ్, మల్లమ్మ, పోశెట్టి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి

జక్రాన్‌పల్లి, జూలై27: విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని వండి వడ్డించాలని మండల ప్రత్యేక అధికారి, పీడీ తిరుమల ప్రసాద్ అన్నారు. శని వారం జక్రాన్‌పల్లిలోని కేజీబీవీ పాఠశాలను మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ ఎంపీడీవో సతీష్‌కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగితెలుసుకున్నారు.పాఠశాలలోని రిజిష్ట్రర్‌లను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మంచిగా వండి వడ్డించాలని వంట ఏజెన్సీలకు సూచించారు.అనంతరం పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సీజల్‌వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు.పరిశుభ్రతను పాటిస్తూ రోగాలు తమ దరిచేరవని విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో

ఆర్మూర్‌రూరల్, జులై27: ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలను శనివారం మండల విద్యాధికారి రాజగంగారాం తనిఖీ చేశారు. అంకాపూర్‌లోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, బీసీకాలనీలోని ప్రాథమిక పాఠశాలను, ఆర్మూర్‌లోని కమలానెహ్రూ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని శుచి, శుభ్రతతో విద్యార్థులకు అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

ప్రమాదకరంగా కల్వర్టు కథనానికి స్పందన



బోధన్‌లో కల్వర్టు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

బోధన్‌రూరల్,జూలై27: ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం ప్రచురితమైన ప్రమాదకరంగా కల్వర్టు కథనానికి అధికారులు స్పందించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు ఆర్ అండ్ బీ అధికారులు ప్రమాదకర కల్వర్టును సందర్శించారు. ప్రమాదాల నివారణ కోసం బారికేడ్లను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రమాదకర కల్వర్టుల వద్దకు ప్రజలు వెళ్లకూడదని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, జూలై27: పట్టణంలోని పలు అంగన్‌వాడి కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం పరిశీలించారు. వర్షాలు పడడంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున కేంద్రాల చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చిన్నారులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించి గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని అంగన్‌వాడి టీచర్‌లను ఆదేశించారు.ఆయన వెంటసానిటరీ ఇన్‌స్పెక్టార్ గజానంద్,ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ పూర్ణమౌళి, తదితరులు ఉన్నారు.

రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపొద్దు

బోధన్‌రూరల్,జూలై27: వాహనదారులు రాంగ్‌రూట్‌లో నడపొద్దని పట్టణ సీఐ వీరయ్య అన్నారు. శుక్రవారం రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న 15వాహనాలను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తబస్టాండ్, పాత బస్టాండ్, శక్కర్‌నగర్ చౌరస్తా, సాత్‌పుల్, రైల్వేట్రాక్ తదితర ప్రాంతాలలో రాంగ్‌రూట్‌లో ద్విచక్ర వాహనదారులు ప్రయాణిస్తున్నారని వీటి వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇక నుండి కొత్త చట్టాలు అముల్లోకి వచ్చాయని ఇక నుండి రాంగ్‌రూట్‌లో వెళ్లిన భారీ జరిమానాలతో పాటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు. వాహనదారులు తప్పకుండా వాహన నియమ, నిబంధనలు పాటించాలన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

మండల గ్రామాల్లో పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు

కోటగిరి,జూలై27: పొతంగల్ మండలంలోని పలు గ్రామాలలో వర్షాలకు ఆరు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. జల్లాపల్లిలో 1, జల్లాపల్లి ఫారంలో 1,కల్లూర్‌లో 1, కారేగాంలో 2, దోమలెడ్గిలో 1చొప్పున వర్షాలకు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని ఆర్థిక సహాయం కోసం ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు.

అథ్లెటిక్స్ క్రీడాకారుడికి ఆర్థిక సహాయం

పెర్కిట్, జూలై27: తెలంగాణ ఇజ్రాయిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అథ్లెటిక్స్ క్రీడాకారుడు అజయ్‌కు రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు మహేష్‌గౌడ్, ఎల్లాప్రసాద్, సాగర్‌లు మాట్లాడుతూ పట్టణానికి చెందిన అజయ్ జాతీయస్థాయిలో రాణిస్తున్నందున అతని మెరుగైన ప్రదర్శన కోసం శిక్షణ పొందడానికి గాను అసోసియేషన్ తరపున ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు.

వర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలి

● ఏబీవీపీ నాయకులు డిమాండ్

డిచ్‌పల్లి,జూలై 27:తెలంగాణ యూనివర్సిటీతో పాటు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు ప్రభుత్వం తక్షణమే రెగ్యూలర్ వైస్ చాన్స్‌లర్‌లను నియామించాలని ఏబీవీపీ జాతీయకార్యవర్గ సభ్యుడు శివా డిమాండ్ చేశారు. శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరినిరసనగా వర్సిటీ కళాశాల ఎదుట పోస్టర్ ల ను ఆవిష్కరించారు.రాష్ట్రంలో యూనివర్సిటీల పరిస్థితి ప్రభుత్వం రెగ్యులర్ వీసీలను నియామించకపోవడంతో అధ్వాన్నంగా మారిం దని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివా విమర్శించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయికుమార్, అమృత్ చారి, నాగరాజు, అనిల్, హరినాథ్, సమీర్, గజేందర్, అక్షయ్, సాయి పాల్గొన్నారు.

గోవూర్ స్కూల్‌కు హెచ్ఎంను నియమించాలి

మోస్రా,జూలై27: మోస్రా మండలంలోని గోవూర్ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ యువకులు మండల విద్యాశాఖ అధికారి నాగనాథ్‌కు గోవూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద వసతి వినతిపత్రం అందజేశారు.జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు సత్యనారాయణ, గంగాప్రసాద్, నర్సయ్య, సాయిలు, సాబేర్, ప్రకాష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను చితకబాదిన అటెండర్ సస్పెన్షన్


ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విచారణ చేపడుతున్న ఆర్డీవో, డీఈవో

ఎల్లారెడ్డి, జూలై 27 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులను కొట్టిన అటెండర్‌ను సస్పెండ్ చేశారు. పాఠశాలలో పని చేస్తున్న అటెండర్ విఠల్ మద్యం మత్తులో విద్యార్థులను కర్రలు, చేతులతో కొట్టిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ వీడియో కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు శనివారం జిల్లా విద్యాధికారి రాజు, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌లు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం సమయంలో మద్యం సేవించి ఉన్న అటెండర్ పాఠశాల ఆవరణలో ఉన్న విద్యార్థులను పాఠశాల గదులలోకి వెళ్లాలని బూత్ మాటలతో తిడుతూ కట్టెతో పాటు చేతుతో కొట్టాడని ఆయన తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అటెండర్ విఠల్‌ని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాధికారి రాజు తెలిపారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న విఠల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్‌ఐ బొజ్జ మహేష్ తెలిపారు. మద్యం మత్తులో ఉన్న అటెండర్ విఠల్ విద్యార్థులను తిడుతూ చేతులు, కర్రలతో కొట్టి విద్యార్థులను గాయపరిచాడని ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండి పెట్టాలి

- మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్‌ను నిలదీసిన బీజేపీ నాయకులు


ప్రిన్సిపాల్‌ను నిలదీస్తున్న బీజేపీ నాయకులు

బాన్సువాడ, జూలై 27 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండి పెట్టాలని, నిర్లక్ష్యం వహించరాదని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఫకీరయ్యను బీజేపీ నాయకులు శనివారం నిలదీశారు. బాన్సువాడ మండలం కొత్తబాది మోడల్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థులు విచారణలో వెల్లడి కావడంతో వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్ ఫకీరయ్యను నిలదీసి మండిపడ్డారు. బీజేపీ నాయకులు ఎంఈవోకు ఫోన్‌లో ప్రిన్సిపాల్ ఫకీరయ్యతో మాట్లాడించారు. మరోసారి మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ గూడుగుట్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, అర్బన్ మండల ప్రధాన కార్యదర్శి పాశం భాస్కర్‌రెడ్డి, కోణాల గంగారెడ్డి, సాయి కిరణ్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో భక్తుల ప్రత్యేకపూజలు


తులాభారం నిర్వహిస్తున్న భక్తులు

బీర్కూర్, జూలై 27 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామసమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో వేంకటేశ్వర స్వామివారిని, అమ్మవార్లను శనివారం భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి దర్శించుకున్నారు. స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఆంధ్ర ప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా నారాయణవరం గ్రామానికి చెందిన హేమాద్రి వనిత దంపతులు తమ కుమారుడికి స్వామివారి సన్నిధిలో నాణ్యాలతో తులాబార కార్యక్రమాన్ని నిర్వహించారు. భవానిపేట్‌కు చెందిన గువ్వల వెంకటగౌడ్, లక్ష్మి దంపతులు ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదలను అందజేశారు.

విద్యార్థులకు అభినందన

కామారెడ్డిటౌన్, జూలై 27 : తెలంగాణ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ 2,4,6 సెమిస్టర్ ఫలితాలలో ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆర్‌కే గ్రూప్‌ఆఫ్ కరస్పాండెంట్ అండ్ సీఈవో డాక్టర్ జైపాల్ రెడ్డి అభినందించారు. 4వ సెమిస్టర్‌లో భవాని, సీహెచ్ మానస, 2వ సెమిస్టర్‌లో మనిషా, 6వ సెమిస్టర్‌లో భావన, నిఖిత, రక్షిత, సాత్వికలు 9.50 పైగా జీపీఏలు సాధించారని తెలిపారు.

డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్

నసురుల్లాబాద్, జూలై 27 : నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామంలో శనివారం మాజీమార్కెట్ కమిటీచైర్మన్ పెరిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ చెక్కులను లబ్దిదా రులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిరాం యాదవ్, మాజీ ఎంపీటీసీ చంద్రాగౌడ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, జగన్, భాస్కర్, చంద్రగౌడ్, లబ్దిదారులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో బోనాల పండుగకు భారీ ఏర్పాట్లు

ఎల్లారెడ్డి, జూలై 27 : పట్టణ కేంద్రంలో ఉన్న ముత్యాల పోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండుగకు ఆలయాన్ని కమిటీ సభ్యులు ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ కమిటీ సభ్యులతో కలిసి ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. ఉదయం 6 గంటలకు ఉత్సవాలు ప్రారంభవుతాయని తెలిపారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణ కేం ద్రంలో ఉన్న పోచమ్మ ఆలయంలో నిర్వహించే బోనాల పం డుగకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హాజరు కాను న్నట్లు మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనా రాయణ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం సత్యనారాయణ ఇంటి నుంచి పలారం బండి ఊరేగింపు, అలాగే బోనాల పండుగలో పాల్గొనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు, మహి ళలు, భక్తులు, నాయకులు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

మాల్తుమ్మెద క్షేత్రంలో 50 ఎకరాల్లో వరి విత్తనోత్పత్తి


సాగు వివరాలు తెలుపుతున్న ఏడీఏ

నాగిరెడ్డిపేట, జూలై 27 : మండలంలోని మాల్తుమ్మెద ప్రభుత్వ విత్తన క్షేత్రంలో ప్రస్తుత ఖరీఫ్‌లో 50 ఎకరాలలో వరి విత్తనోత్పత్తి కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని విత్తన క్షేత్రం ఏడీఏ వీరస్వామి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. విత్తన క్షేత్రం పరిధిలో 701 ఎకరాల భూములున్నాయని, అందులో కేవలం 102 ఎకరాలు సాగుకు యోగ్యంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌లో విత్తన క్షేత్రంలో కేఎన్ఎం 1638 రకం వరిని విత్తనోత్పత్తి కోసం 50 ఎకరాలలో సాగు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా క్షేత్రంలోని బోర్ల ద్వారా క్షేత్రంలో పంటల సాగుకోసం నీరు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వర్షాలు సరిగ్గా కుర వనందున, ఇప్పటి వరకు పోచారం ప్రాజెక్టులో 10 అడుగుల నీరు మాత్రమే వచ్చిందన్నారు. ప్రస్తుతం క్షేత్రంలో 11 బోర్లు ఉన్నాయని, ఈ బోరు నీటి సహాయంతో 50 ఎకరాలలో వరి విత్తనోత్పత్తి జరుపనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

బదిలీలు, పదోన్నతుల సమస్యను తీర్చాలని వినతి


డీఈవో రాజుకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సమైక్య సభ్యులు

కామారెడ్డి టౌన్, జూలై 27: బదిలీలు, పదోన్నతులలో నెలకొన్ని అనిశ్చితిని తొలగించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా కార్యవర్గసభ్యులు డీఈవో రాజును కోరారు. శనివారం పలు అంశాలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కట్‌ఆఫ్ తేదీ లేకుండా ముందు సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయులను ప్రమోషన్ సీనియార్టీ జాబితా నుంచి తొలగించాలని, ఉపాధ్యాయ సంఘాలు అన్ని కలిసి నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. అంశాలన్నీ డీఈవో వెబ్‌సైట్‌లో ముందుగా పొందుపరచాలని అన్నారు. ఏపీసీ ఫైనల్ బిల్లులన్ని తక్షణమే విడు దల చేయాలని, స్కావెంజర్స్‌ను వెంటనే నియ మించాలని, ఇటీవల జరిగిన పదోన్నతులలో నష్టపోయిన ఉపాధ్యాయులకు కోర్టు అందించిన ఉత్తర్వుల ఆధారంగా న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా య సమైక్య సభ్యులు రాజేష్, ప్రవీణ్‌కుమార్,బషీర్, రాములు, యాదయ్య, సంతోష్, విజయరామరాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుపై ఎంపీవో విచారణ


విచారణ చేపడుతున్న ఎంపీవో సత్యనారాయణ

బాన్సువాడ, జూలై 27 : మండలంలోని బోర్లా క్యాంపు గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీవో విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఓ మహిళ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో బాన్సువాడ ఎంపీవో సత్యనారాయణ శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి మహిళ ఫిర్యాదులు పరిశీలించారు. గ్రామంలోని గ్రామ పంచాయతీ భవన స్థలం ఆ మహిళకు సంబంధించిందని ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు ఎంపీవో తెలిపారు. పూర్తి డాక్యుమెంట్లు తీసుకుని రావాలని, దానిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఆ తరువాతనే నిర్ణయించడం జరుగుతుందని మహిళకు తెలిపినట్లు ఆయన వివరించారు.

పాఠశాలలో వైద్యశిబిరం

బాన్సువాడటౌన్ , జూలై 27 : పట్టణంలోని సింధు విద్యాలయంలో శనివారం సెవెన్‌హిల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు రఘుతేజ, వాగ్దేవిలు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్, వైద్య సిబ్బంది , పాఠశాల సిబ్బంది ఉన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న బాన్సువాడ జూనియర్ సివిల్ న్యాయాధికారి

బాన్సువాడటౌన్ , జూలై 27 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బాన్సువాడ జూనియర్ సివిల్ న్యాయాధికారి టీఎస్పీ భార్గవి పాల్గొని మాట్లాడారు. ర్యాగింగ్ వల్ల జరిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలుంటాయన్నారు. విద్యార్థులు తప్పుడు మార్గంలో నడవకుండా, సన్మార్గంలో నడుచుకుంటూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణమూర్తి, న్యాయవాదులు మోహన్‌రెడ్డి, ఖలీల్, నాగ్‌నాథ్, ఎస్సై జగన్నాథం ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బాన్సువాడటౌన్ , జూలై 27 : పట్టణంలోని ఎంసీహెచ్ ఆస్పత్రిలో శనివారం హన్మాజీపేట పీహెచ్‌సీ ఇన్‌చార్జి డా.సాయికుమార్ సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నట్టుండి గుండె కొట్టుకోవడం ఆగిపోయినపుడు వారి ప్రాణాలను కాపాడేందుకు చేసే అత్యవసర చికిత్సనే సీపీఆర్ అని తెలిపారు. సీపీఆర్‌లో ప్రధానంగా మూడు అంశాలు ఉంటాయని చెస్ట్ కంప్రెషన్, ఎయిర్‌వే పెటెన్సీ , శ్వాస ఆడేలా చూడటమన్నారు. ఓ వ్యక్తి గుండె ఆగిపోయినపుడు సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శ్రీనివాస్ ప్రసాద్, దయానంద్, రాంచందర్, అంగన్‌వాడీ టీచర్లు మహాదేవి, ఆరోగ్య సిబ్బంది తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి అండ

భిక్కనూరు, జూలై 27 : రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవదానం చేసి మృతిచెందిన పెద్దమల్లారెడ్డి వాసి మెట్టు ప్రవీణ్ కుటుంబానికి విజ్ఞాన్ పాఠశాల యాజమాన్యం అండగా నిలిచింది. ప్రవీణ్‌కుమార్తె ఉద్విత‌కు పాఠశాలలో 1వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు ఉచితంగా విద్యను అందించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉద్వితకు ఉచిత అడ్మిషన్ ఇవ్వడంతో పాటు పాఠ్యపుస్తకాలు అందించారు. విద్యకు సంబంధించిన పూర్తి బాధ్యత తామే చూసుకుంటామని ఆయన కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. ట్రస్ట్‌సభ్యులు సంతోష్, సురేష్‌రెడ్డి, రవి, నరేష్, రాజేందర్ పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ ఎస్ఐగా మహేందర్

పెద్ద కొడప్‌గల్, జూలై 27 : పెద్దకొడప్‌గల్ ఎస్ఐగా శనివారం మహేందర్ బాధ్యతలు స్వీకరించారు. పెద్దకొడప్‌గల్ ఎస్ఐగా పనిచేస్తున్న కోనారెడ్డి జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లగా, జిల్లా కేంద్రంలో సీసీఎస్‌లో పనిచేస్తున్న మహేందర్‌ను అధికారులు కొడప్‌గల్ ఎస్ఐగా నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న మహేందర్ మాట్లాడుతు మండలంలో శాంతి భద్రతల కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సహకారంతో మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేస్తానని తెలిపారు. ఎస్ఐకి స్థానిక ప్రజాప్రతినిధులు పూలమాల వేసి స్వాగతం పలికారు.

అగ్నిమాపక కేంద్రం సందర్శించిన విద్యార్థులు


అగ్నిమాపక కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మద్నూర్, జూలై 27 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం విద్యార్థులు స్థానిక అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఫైర్ అధికారి నర్సింలు అన్ని రకాల అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు డెమో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశం, మల్లేశం, తపస్ జిల్లా ఉపాధ్యక్షులు రచ్చ శివకాంత్, ఉపాధ్యాయులు షాహీన్ బేగం, ఇన్‌చార్జి అగ్ని మాపక అధికారి నర్సింలు, అగ్ని మాపక సిబ్బంది సంతోష్, రాజేందర్, దిగంబర్ పాల్గొన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచండి : ఎంపీడీవో

పెద్ద కొడప్‌గల్, జూలై 27: ప్రస్తుత సీజన్ వర్షాకాలం అయినందున జుక్కల్ మండలంలోని అన్ని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం మండలంలోని మహమ్మదాబాద్, కంఠాలి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ సీజన్ వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వ్యాధుల నివారణకు ముందుగానే పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామాలలో మురికి కాలువలు శుభ్రపర్చడంతో పాటు, వీధులలో చెత్త పేరుకుపోకుండా చూడాలన్నారు.

బదిలీపై వెళ్లిన వైద్యులకు సన్మానం

దోమకొండ, జూలై 27 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించిన వైద్యసిబ్బంది సాధారణ బదిలీలో భాగంగా ఇతర చోటకు బదిలీపై వెళ్లడంతో శనివారం ఆసుపత్రి సుపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వైద్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పద్మావతి వైద్యురాలు, విమల ఫార్మాసిస్ట్ కామారెడ్డి, ప్రమీల స్టాఫ్‌నర్సు సిరిసిల్ల, శ్యామ్ రేడియోగ్రాఫర్ నీలోఫర్ హైదరాబాద్, శంకర్ ఎంఎన్‌ఓ బాన్సువాడ ఆసుపత్రికి బదిలీ అయినట్లు సుపరింటెండెంట్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు దివ్య, శ్రీవాణి, మీనా, సిబ్బంది పాల్గొన్నారు.

'సంస్కృతి, సంప్రదాయాలు అలవర్చుకోవాలి'

కామారెడ్డిరూరల్, జూలై 27 : జిల్లా కేంద్రంలోని వాసవిపబ్లిక్ పాఠశాలలో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులను చక్కగా ముస్తాబు చేయించి బోనాలతో అమ్మవారికి నైవైద్యాలను సమర్పింపచేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ హనుమంత్‌రావు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను నేర్పాలనే ఉద్దేశంతో విద్యార్థులతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

కంచర్లలో ఆషాఢబోనాలు

భిక్కనూరు,జూలై 27 : మండలంలోని కంచర్లలో ఆషాఢబోనాల కార్యక్రమాన్ని గ్రామకుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఇంటికి ఒక బోనం తీసి డప్పుచప్పులు, పోత రాజుల విన్యాసాల నడుమ గ్రామదేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బాధిత కుటుంబానికి ఎల్ఓసీ అందజేత

కామారెడ్డిటౌన్, జూలై 27 : పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీకి చెందిన పగడాల శంకర్ ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడడంతో తలలో రక్తం గడ్డకట్టి ఆసుపత్రి పాలయ్యాడు. దీంతో శస్త్రచికిత్స కోసం అతడి కుటుంబసభ్యులు ప్రభుత్వ సలహాదారు మహ్మద్‌అలీ షబ్బీర్‌ను సంప్రదించడంతో సీఎంఆర్ఎఫ్ కింద 2.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. శనివారం హైదరాబాద్‌లో బాధిత కుటుంబసభ్యులకు ఎల్‌ఓసీని అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బిచ్కుంద, జూలై 27 : మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఆజామ్ (45) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కరెంటు పని నిమిత్తం వెళ్లి పని ముగించుకున్న తర్వాత ఆజామ్‌కు ఫిట్స్ రావడంతో అక్కడే స్పృహ కోల్పోయాడు. వెంటనే లైన్‌మన్ మహేష్ తన అన్న షరీఫ్‌కి సమాచారం ఇచ్చి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని అన్న షరీఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని తెలిపారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం

గాంధారి, జూలై 27 : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఇతర మండలాలకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీఓ మాట్లాడుతూ ఇక్కడ విధులు ఇన్ని రోజులు నిర్వహించినందుకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, పంచాయతీ కార్య దర్శులు తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	ఓసీ
దర్శన్	డెడ్‌పూల్
ప్రియా 70	కల్కి
ప్రియా 35	రాయన్

బాన్సువాడ	
మహేశ్వరి	రాయన్
వెంకటేశ్వర	పురుషోత్తముడు

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	230



